ఉపాధిలో పశువుల పాకలు

- పెన్‌పహాడ్ మండలానికి 15 యూనిట్లు కేటాయింపు
- ఈజీఎస్‌లో పూర్తి సబ్సిడీపై నిర్మాణాలు
- రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పెన్‌పహాడ్ : మనుషులు తల దాచుకోవడానికి ఇల్లు ఎంతో అవసరమో.. పశువులు ఆరోగ్యంగా ఉండటానికి కొట్టాలు అంతే ముఖ్యం. వీటిని నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని చాలా మంది పశువుల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి రైతులు, పెంపకందారులు పశువుల పాకల నిర్మాణాలను పూర్తిగా సబ్సిడీపై నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సాయమందించేందుకు ప్రణాళికలు రూపొందించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పశువుల పాకలు నిర్మించేందుకు నిర్ణయించింది. ఆసక్తి గల రైతులు, పెంపకందారుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఆరుబయట, చెట్ల కిందే పశువులు..

పెన్‌పహాడ్ మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు, పశువుల పెంపకందారులకు పశువుల పాకల్లేవు. పశువులను ఆరుబయట, చెట్ల కింద కట్టేస్తున్నారు. దీంతో పశువులు వాన, చలి, ఎండకు తట్టుకోలేక రోగాల బారిన పడుతున్నాయి. దూడలు మృత్యువాత పడుతున్నాయి. వానాకాలంలో మేత తడిసి వృథా అవుతోంది. అయితే ప్రభుత్వం పశువుల పాకల నిర్మాణాలు చేపడుతుండటంతో రైతులు, పశువుల పెంపకందారులకు మంచి అవకాశం లభించింది.


సింగారెడ్డిపాలెంలో పశువుల పాక నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు (ఫైల్)

రూ.84 వేల సబ్సిడీ..

పెన్‌పహాడ్ మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే మండలంలో పశువుల పాలక నిర్మాణాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 15 యూనిట్లు కేటాయించారు. పశువుల పాకలకు రూ. 84వేలు ఇవ్వనున్నారు. 17.50 ఫీట్ల పొడవు, 10 ఫీట్ల వెడల్పుతో వీటి నిర్మాణాలు చేపట్టనున్నారు. వీటి నిర్మాణాలను పూర్తి చేసిన అనంతరం రైతుల బ్యాంక్ అకౌంట్‌లో ఈజీఎస్ పథకం ద్వారా డబ్బులు జమ చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పశువుల పాకల నిర్మాణాలకు అర్హత గల రైతులు, పశువుల పెంపకందారులు గ్రామ పంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించిన తరువాత అర్హులైన వారికి పశువుల పాకలు మంజూరు చేస్తాం. నిర్మాణాలు పూర్తయిన అనంతరం వాటి కొలతలు వేసి డబ్బులు మంజూరు చేస్తాం.
– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

క్లుప్తంగా

శాంతి భద్రతలను కాపాడాలి


పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న రూరల్ సీఐ రాజశేఖర్

పెన్‌పహాడ్ : సమాజంలో అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గోపికృష్ణ, ఏఎస్‌ఐ రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన మాద రాములమ్మ, సీతారాంపురం గ్రామానికి చెందిన బండెల పెద్దలక్ష్మమ్మలు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ మృతులకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మృతుల కుటుంబీకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నూతనకల్ : బాలబాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి రోగాల బారినుంచి కాపాడుకోవాలని మండల వైద్యాధికారి కీసర అశ్రితారెడ్డి అన్నారు. శుక్రవారం గుండ్లసింగారంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శరణ్‌నాయక్, వైద్య సిబ్బంది పుష్ప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న హమాలీలు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన హమాలీ కార్మికుడు సాయిని శేషు ఇటీవల మృతిచెందారు. మృతుడి కుటుంబీకులకు శుక్రవారం స్థానిక లక్ష్మీనర్సింహస్వామి హమాలీ సంఘం, సిమెంట్ ఐరన్ హార్డ్‌వేర్, ఎరువుల దుకాణాల ఆధ్వర్యంలో రూ.21,800 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు సాయిని కృష్ణ, హమాలీలు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా శుక్రవారం 5వరోజు ఐదవ పాశురాన్ని అర్చకులు పఠించారు. అలాగే మహిళలు గోదాదేవికి కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

11వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష


కలెక్టరేట్ ఎదుట బోనాలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భానుపురి : విద్యాశాఖలో పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం 11వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు బోనాలతో తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట తమ నిరసన తెలిపారు. అనంతరం పలువురు ఉద్యోగులు మాట్లాడారు. విద్యాశాఖ పూర్తిగా స్తంభించిపోయిందని, తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తమ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ నిరాహార దీక్షలకు వివిధ సంఘాలకు చెందిన ఝాన్సీ సౌజన్య, సాంబశివరావు, సైదులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్, లక్ష్మీనారాయణ, రాంబాబు, పెండెం శ్రీనివాస్, శ్రీధర్, తేజశ్రీ, కాంపాటి శ్రీనివాస్, హరిత, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్టు


మద్దిరాలలో అరెస్టయిన ఆటో డ్రైవర్లు


ఆత్మకూర్ (ఎస్) : పోలీస్‌స్టేషన్‌లో..

మద్దిరాల : తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌కు పిలుపు ఇవ్వడంతో శుక్రవారం మండలానికి చెందిన ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా తమ ఆటోలకు గిరాకీ లేకుండా పోయిందని, ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉందని అన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.12వేలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పులుగుజ్జ వెంకన్న, రాంపాక వెంకన్న, వెలుగు సైదులు, బర్పటి రవిందర్, మహేష్, శ్రీను, ప్రశాంత్, గుపాల్, నవీన్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మండల వ్యాప్తంగా ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంఘం మండల అధ్యక్షుడు గిలకత్తుల సుధాకర్ మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించకుండా అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు కాసం వీరయ్య, రాచమల్ల సంతోష్, మొరిశెట్టి రాములు, ఉపేందర్, భద్రయ్య, కొల్లు శీను, వెంకన్న పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడల కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్ : ఉమ్మడి నల్లగొండ యువ చైతన్య మహాసభ, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం జిల్లా కేంద్రంలో డీఎస్పీ రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతి యువజన సంఘం వ్యవస్థాపకుడు చిప్పలపల్లి విక్రమ్, గౌరవ అధ్యక్షుడు చిప్పలపల్లి చిరంజీవి మాట్లాడారు. జనవరి 12న నాగారం మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూరం వెంకన్న, చిప్పలపల్లి ఉపేందర్, దున్నపోతుల చంద్రశేఖర్, చిప్పలపల్లి నాగార్జున్, చిప్పలపల్లి బాలస్వామి, చిప్పలపల్లి శివ, పాల్వాయి క్లింటన్, పంది ప్రశాంత్, చిప్పలపల్లి మహేష్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు నమోదు హేయమైన చర్య

అర్వపల్లి : ఫార్ములా ఈ–రేసుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌పై కక్షసాధింపు చర్యల్లో భాగంగా తప్పుడు కేసు నమోదు చేశారని చెప్పారు. కేటీఆర్‌పై నమోదైన కేసును వెంటనే ఎత్తివేయాలని, లేనిచో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి నరేష్, బైరబోయిన పెద్దయ్య, ఎం.రాజలింగం, వెంకన్న, ప్రభు, కె. మల్లేష్, టి.మల్లేష్, ఎం.సైదులు, కె.నాగరాజు, వెంకన్న, చంద్రయ్య, పరమేష్, శ్రీకాంత్, లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే


అర్వపల్లి : కొమ్మాలలో సర్వేను పరిశీలిస్తున్న పీఏసీఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి

అర్వపల్లి : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. కొమ్మాలలో శుక్రవారం ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి మాట్లాడారు. సర్వే పూర్తికాగానే అర్హులందరికీ అంచెలంచెలుగా ఇళ్లు మంజూరు కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండడి పూర్ణచంద్రారెడ్డి, కార్యదర్శి నారాయణమూర్తి, కె.సైదులు, వీరభద్రం, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఉదయ్, వెంకటాద్రి, వీరేష్, నర్సింహ, వెంకన్న, ఫీల్డ్ అసిస్టెంట్ శైలజ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, కుంచమర్తి తదితర గ్రామాల్లో మండల పంచాయతీ అధికారి టి.గోపి పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పూర్తి వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదుచేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు మాగి నాగయ్య, ఆసియ, సిబ్బంది సైదుల సతీష్, కుంభం రామ్మూర్తి, బోయపల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో వివరాల నమోదు

మద్దిరాల : ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా శుక్రవారం రెడ్డిగూడెంలో ఎంపీఓ ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శి ఉమ ప్రజల నుంచి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టడంపై అవగాహన


నాగారంలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్


ఫణిగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, టీచర్లు

నాగారం : సమాజంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించి, విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. దేశాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు జ్ఞానేశ్వరచారి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు హరిత, రేణుక, వసంత, కవిత, రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను వక్రీకరించడం సరికాదు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిబాబు

తుంగతుర్తి : బీఆర్ అంబేద్కర్‌కు కాంగ్రెస్ పార్టీ చేసిన అవమానాల్ని వివరిస్తున్న క్రమంలో కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వక్రీకరించడం సరికాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్‌ని రెండుసార్లు ఓడించిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానపరిచిందని, స్మృతి వనాన్ని కూడా నిర్మించలేని అసమర్థ పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఉండి కూడా భారతరత్న అవార్డు ప్రకటించకుండా అంబేద్కర్‌కు అన్యాయం చేసిందన్నారు. బీజేపీని దళితులకు దూరం చేసే కుట్రలో భాగమే అమిత్‌షా వ్యాఖ్యల వక్రీకరణ అని తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు మహేందర్, లింగయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన


భానుపురి : సంతోష్ బాబు చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు


తిరుమలగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

భానుపురి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. శుక్రవారం అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక సంతోష్ బాబు చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సంధ్య, మౌనిక, మమత, నవ్య, మహేష్, పవన్, వినయ్, నవీన్ పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

అంబేద్కర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పేర్ల నాగయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నరసయ్య, పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు ఎస్‌కే సయ్యద్, చిత్తలూరి లింగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రేణుక, కోశాధికారి మోటకట్ల జయమ్మ, ఐతరాజు పద్మ, శంకర్, రాహుల్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్ : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు సూర్యాపేట నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చింత వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్‌పై విమర్శ చేసే అర్హత అమిత్ షాకు లేదని పేర్కొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

తిరుమలగిరి : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వెంటనే క్షమాపణ చెప్పాలని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి సూర్యాపేట జిల్లా కన్వీనర్ గంట యాకూబ్ డిమాండ్ చేశారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం తిరుమలగిరిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చింతపల్లి శేఖర్, గంట సందీప్, లక్ష్మణ్, జాని, ప్రభుదాస్, రవి, మల్లేష్, దిలీప్, భాస్కర్, యాకూబ్, వెంకన్న, ప్రశాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేటలో నిరసన..

నూతనకల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను సీపీఎం, మాల మహానాడుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై వేర్వేరుగా దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, మాలహానాడు నాయకులు కందాల శంకర్‌రెడ్డి, గొరెంట్ల శ్రీను, పిట్టల భాగ్యమ్మ, నాగంటి యాదగిరి, మహేశ్వరం మాణిక్యం, బత్తుల తిరుమలేష్, పోలేపాక శ్రీనివాస్, బాణాల విజయ్, బత్తుల లక్ష్మణ్, యల్లావుల లింగయ్య, దాసరి రవి, బొజ్జ శ్రీనివాస్, పట్టేటి యాదగిరి, పేరం రమేష్, భద్రయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి : అంబేద్కర్‌ను కించపరిచేలా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్యని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, పల్లా సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ తాటి విజయమ్మ, గడ్డం ఎల్ల య్య, దేవరాజ్, వెంకన్న, ముత్తయ్య, అంతయ్య పాల్గొన్నారు.

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

అంబేద్కర్‌పై అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ తుంగతుర్తి నియోజకవర్గ నాయకుడు తడకమళ్ల రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను బే షరతుగా వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు బొంకూరి మల్లేష్, బొంకూరి మధు, బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

అర్వపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం అర్వపల్లిలో అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్, సీపీఎం ఆధ్వర్యంలో అర్వపల్లిలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం హైవేపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల అర్వపల్లి, మాజీ ఎంపీపీ ఎర్రనర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంకుడుపాల రవి, ఈదురు వీరపాపయ్య, దాసరి భిక్షం, పగిడిమర్రి రామ్మూర్తి, సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, దడిపల్లి వెంకట్, ముత్తయ్య, రెంటాల కరుణకుమార్, శిగ వెంకన్న, శ్రీను, వజ్జె సైదయ్య, పగిడిమర్రి శేఖర్, అర్జున్, రమేష్, ఈదుల సంతోష్, వెంకన్న, అబ్బులు, గోవర్ధన్ పాల్గొన్నారు.

పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

నాగారం : రాజ్యసభలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అగౌరవపర్చిన కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్‌కె.వలీ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.


నూతనకల్‌లో..


అర్వపల్లిలో..


తుంగతుర్తిలో..

వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఎంపిక

తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి



కోదాడ : కోదాడలో నిర్వహించిన జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల (నాచురల్ ఫార్మింగ్) విభాగంలో అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రేణుక, చందనలు గైడ్ టీచర్ ఎన్. వెంకటేశ్వర్లు సూచనలతో తయారు చేసిన మోడల్ ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. హైడ్రోఫోనిక్స్ (జలవర్ధనం) మృత్తిక లేకుండా మొక్కలను పోషకద్రావణంలో పెంచడం ద్వార ఇంట్లోకి కావల్సిన కూరగాయలు, పుష్పాలను ఇచ్చే మొక్కలను పెంచుకోవచ్చు. తక్కువ నీటిని ఉపయోగించి ఎక్కువ సాగు చేయడానికి బాటిల్ ద్వారా మొక్కల వేర్లకు నీటిని చిన్న పైపుల ద్వారా అందించి దిగుబడులు సాధించవచ్చు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెంచుకోవచ్చు.

చెట్ల ఎత్తును సులువుగా తెలుసుకోవచ్చు



కోదాడ : జిల్లా సైన్స్‌ఫెయిర్‌లో గణిత మోడల్ విభాగంలో కోదాడలోని జయ పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన క్లినోమీటర్ ప్రాజెక్ట్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు నౌషియా, మాన్యలు గైడ్ టీచర్ రాజు ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ తయారు చేశారు. దీన్ని ఉపయోగించి దూరంగా ఉన్న చెట్ల ఎత్తును, బహుళ అంతస్తుల భవనాల ఎత్తును సులువుగా తెలుసుకోవచ్చని విద్యార్థులు చెప్తున్నారు. గణితశాస్త్రంలో ఉపయోగించే కొన్ని ఫార్ములాల ఆధారంగా ఈ పరికరాన్ని తయారు చేశామని చెబుతున్నారు. పెద్దగా ఖర్చు లేకుండా చిన్న అట్టముక్కల సాయంతో దీన్ని వీరు తయారు చేయడం గమనించదగ్గ విషయం.

'మాంటిస్సోరి'లో స్పోర్ట్స్ డే

అర్వపల్లి : అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో స్పోర్ట్స్ డే వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ప్రతి ఏటా పాఠశాలలో స్పోర్ట్స్ డే నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ విపిన్‌కుమార్, ఉపాధ్యాయులు గిరిజ, అమర్, చంద్రశేఖర్, రమ, రజిత, దేవేంద్ర, నిఖిత, మమత పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

చిలుకూరు : బేతవోలులో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు. శుక్రవారం బేతవోలులో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎనిమిది లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు

అర్వపల్లి : వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రైతులకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రుణాలను ఇస్తున్నట్లు జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ మేనేజర్ బి. రామకృష్ణ, సూర్యాపేట ఆర్‌బీఓ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. జాజిరెడ్డిగూడెంలోని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కిసాన్ దివస్‌లో భాగంగా శుక్రవారం అన్నదాత మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే బ్యాంక్ లక్ష్యమని చెప్పారు. బ్యాంక్ రైతులకు ఇస్తున్న రుణాలపై వివరించారు. రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి సురేందర్, సిబ్బంది పృథ్వీరాజు, సుధీర్, విజయ్, నరేష్, విజయ్, రాజశేఖర్, వెంకటేష్, లింగమల్లు, వీఓఏ కృష్ణకుమారి పాల్గొన్నారు.


రాష్ట్రీయ కిసాన్ దివస్ బ్రోచర్లను ప్రదర్శిస్తున్న బ్యాంక్ అధికారులు